II

తెలంగాణ జైత్రయాత్ర 2023

నమస్తే తెలంగాణ

కరీంనగర్ | సోమవారం 20 నవంబర్ 2023 www.ntnews.com

మీకు తెలుసా?

## తెలంగాణలో అయిల్ పామ్ సాగు విస్తీర్ణం

| 2014-15లో | 2022-23లో |
|---|---|
| 972 హెక్టార్లు | 17,657 హెక్టార్లు |



మాది వ్యవసాయ కుటుంబం. దళిత బంధు డబ్బుతో వెల్డింగ్, ఇంజినీరింగ్ వర్క్‌షాప్ పెట్టుకున్నం. మేం ఉపాధి పొందుతూ మరో నలుగురికి పని ఇస్తున్నం. ఇద్దరు కూతుళ్లను ఉన్నత చదువులు చదివిస్తున్నం.

-మేరుగు కృష్ణవేణి-ఎల్లయ్య, లింగారెడ్డిపల్లి, సిద్దిపేట

నేను గ్రామపంచాయతీలో కార్మికుడిగా పని చేసేవాడ్ని. దళితబంధు పైసలతో 4 పాడిపశువులు కొనుక్కున్నా. బర్రెల కోసం షెడ్డు నిర్మించి, బోరు వేసుకున్నా. రోజూ 20 లీటర్ల పాలు పోస్తే మొదటి నెల రూ.20 వేల ఆదాయం వచ్చింది.

-జక్కుల కనకయ్య, చీలాపూర్‌పల్లి, సిద్దిపేట జిల్లా

వంద రూపాయలూ దొరకని రోజుల్ని చూసిన. అప్పులు చేయనిదే పూట గడిచేది కాదు. దళితబంధు ద్వారా ప్రారంభించిన సిమెంట్, స్టీలు వ్యాపారంలో అనుభవం లేకపోవడంతో మొదట్లో కొంత ఇబ్బంది పడ్డా. ఇప్పుడు లాభాలు వస్తున్నయి.

-గడిపె కొమురయ్య, హుస్నాబాద్

ఓ కిరాణా దుకాణంలో పని చేసేటోణ్ని. పాత ఆటోలో కొబ్బరికాయలు వేసుకొని ఊర్ల పొంటి తిరిగి వేసేటోణ్ని. దళిత బంధు పైసలతో బస్వాపూర్‌లో దుకాణం పెట్టుకున్న. దుకాణం మంచిగ నడుస్తాంది. ఆర్థికంగా నిలదొక్కుకున్న.

-చిట్యాల ఎల్లయ్య, ఆరెపల్లి, కోహెడ

ముఖ్యమంత్రి కేసీఆర్ దళితబంధు పథకాన్ని తీసుకొచ్చి దళితుల పాలిట దేవుడయ్యారు. దళితబంధు కింద కారు తీసుకున్నా. మొదట్లో జీతానికి కారు డ్రైవరుగా పని చేసిన. ఇప్పుడు నెలకు రూ.25 వేల వరకు సంపాదిస్తున్నా.

-సముద్రాల కల్యాణ్, తిర్మలాపూర్, మెదక్ జిల్లా

హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా జీతానికి పని చేస్తూ నానా ఇబ్బందులు పడ్డా. దళితబంధు పథకంలో ట్రాక్టర్ మంజూరు అయ్యింది. ఇప్పుడు సొంత గ్రామంలోనే ఉంటూ ఉపాధి పొందడం చాలా సంతోషంగా ఉంది.

-బేగరి మల్లేశం, తిర్మలాపూర్, మెదక్ జిల్లా

సుతారి పని చేసుకొని పొట్ట పోసుకుంటున్న నాకు దళితబంధు వరమైంది. దళితబంధు నిధులతో సెంట్రింగ్ మెటీరియల్, సిమెంట్ షాపు పెట్టుకున్నా. సెంట్రింగ్ సామగ్రి కిరాయికి ఇస్తూ నెలకు 15 వేలు సంపాదిస్తున్నా.

-కొత్త కనకయ్య, గాడిచెర్లపల్లి, సిద్దిపేట జిల్లా

ప్రేమ-పెళ్లి పేరుతో ఓ మగమహారాజు చేతిలో మోసపోయి కళ తప్పిన జీవితం అనుభవిస్తున్న కళావతి జీవితానికి లేడీస్ ఎంపోరియం ద్వారా కొత్త కళ వచ్చింది. బట్టల దుకాణంలో గుమస్తాగా పనిచేసిన నర్సయ్య ఇప్పుడు ఫ్యాషన్ హబ్‌కు ఓనర్‌గా గుర్తింపు పొందారు. చాలీచాలని జీతానికే ప్రైవేటు స్కూలు యాజమాన్యం చెప్పుచేతల్లో పనిచేసిన దేవయ్య ఇప్పుడు ఫుట్‌వేర్ యజమాని అని నలుగురు చెప్పుకొనేలా జీవితం మలుపు తిరిగింది.. ఇలా ఒక్కరా, ఇద్దరా..? ఊరికి చివరన, అభివృద్ధికి దూరంగా ఉంటూ బతుకు వెళ్లదీసిన దళితులకు స్వరాష్ట్రంలోనే మంచి రోజులు వచ్చాయనే మాట సత్యదూరం కాదు! నౌకర్లెందరినో ఓనర్లుగా మార్చిన చారిత్రాత్మక పథకం.. దళితబంధు!! – నమస్తే తెలంగాణ నెట్‌వర్క్



# నిన్న నౌకర్లు.. నేడు ఓనర్లు

పేదల జీవితాల్లో 'దళితబంధు' వెలుగులు

- దళితులు ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశాల కల్పన
- ప్రభుత్వ సాయం.. ఆత్మగౌరవంతో జీవనం
- లబ్ధిదారుల మనోగతమిది

బిగ్ స్టోరీ

## కేసీఆర్ సారు తండ్రిలా ఆదుకున్నరు..

నిరుపేద కుటుంబం మాది. నేను ఉపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్ళినప్పుడు నాకు ఓ వ్యక్తితో పరిచయమైంది. ఆయన తనకు పెళ్లి కాలేదని మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకున్నడు. ఇద్దరు పిల్లలు పుట్టారు. ఆ తర్వాత తెలిసిందేమిటంటే, ఆయనకు అంతకుముందే పెళ్లి జరిగిందని. నేను రెండో భార్యనని.. దీనిపై నిలదీస్తే నన్ను ఇంటి నుంచి గెంటేశాడు. చేసేది లేక నిజాంసాగర్‌లోని పుట్టింటికి వచ్చేశా. మా తల్లి ఎంతో పేద. నేను ఏం చేయాలో అర్థం కాక తల పట్టుకొనేదాన్ని. ఈ పరిస్థితుల్లో కేసీఆర్ సారు నన్ను తండ్రిలాగా ఆదుకున్నడు. దళిత బంధు కింద రూ.10లక్షలు ఇచ్చిండు. ఈ పైసలతోని ఏం చేయాల్నో అర్థం కాలేదు. జనరల్ స్టోర్, లేడీస్ ఎంపోరియం పెట్టుకోవాలని తెలిసినోళ్లు సలహా ఇచ్చిండ్రు. ఇది నాకు ఎంతో నచ్చింది. కూర్చున్న దగ్గర సంపాదించవచ్చని జనరల్ స్టోర్ పెట్టుకున్న. దేవుడి దయతో నా దుకాణం మంచిగా నడుస్తున్నది. నా ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్న. ఆర్థికంగా కూడా నిలదొక్కుకుంటున్న. నాకు సొంత ఇల్లు లేదు. ప్లాట్ కొనుక్కుందామని రూపాయి రూపాయి పొదుపు చేసుకుంటున్న. నా జీవితం ఏమైపోతదోననే భయం ఉండేటిది. దళితబంధుతో ఆ భయం పోయింది. ఇప్పుడు ఎంతో స్వాభిమానంతో వ్యాపారం చేసుకుంటున్న. నా కుటుంబాన్ని పోషించుకుంటున్న. (ఈ విషయం చెబుతూ ఆమె కన్నీటి పర్యంతమైంది... కేసీఆర్ తనకు తండ్రిలాంటి వారని, ఆయన రుణాన్ని జీవితాంతం మర్చిపోనని భోరున విలపించింది)

– కళావతి, నిజాంసాగర్



## ఏడాదిలోనే 3 లక్షల అప్పు తీర్చిన..

హుజూరాబాద్‌లో పైలట్ ప్రాజెక్టుగా అమలైన దళిత బంధు ఉపాధి మార్గాన్ని చూపింది. చిన్నతనం నుంచి పాలేరుగా బతికిన. పెద్దయ్యాక కౌలు రైతుగా మారిన. జీవితంలో అనేక కష్టాలు పడ్డా. రెక్కల కష్టం మీదనే జీవితం గడిచిపోయింది. మోకాళ్ల నొప్పులు, ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టడంతో ఇక బతుకుడు ఎట్లా అని బాధపడుతున్న సమయంలో దళితబంధు వెలుగు రేఖలు నింపింది. దళితబంధు పథకంలో భాగంగా మినీ డెయిరీ యూనిట్‌ను నెలకొల్పిన. మొదటి విడుతలో మంజూరైన రూ.5 లక్షల్లో రూ.1.50 లక్షలతో షెడ్డు నిర్మించుకున్నా. మిగతా రూ.3.50 లక్షలతో గుజరాత్ నుంచి నాలుగు బర్రెలు తెచ్చుకున్నా. పూటకు 16 నుంచి 20 లీటర్ల పాలు పోస్తున్నా. కష్టానికి తగ్గ ఫలితం కనిపిస్తున్నది. బతుకుపై దిగులు మాయమైపోయింది. నెలకు ఖర్చులు పోను రూ. 40 వేల వరకు ఆదాయం వస్తున్నది. ఏడాదిలోనే మా పెద్దమ్మాయి పెండ్లికి చేసిన రూ. 3 లక్షల అప్పు తీర్చిన. బతుకుపై భరోసా కలిగింది. కుటుంబంతో కలిసి హాయిగా బతుకుతున్నా. కేసీఆర్ సారుకు రుణపడి ఉంట.

-మిడిదొడ్డి సారయ్య, తుమ్మనపల్లి, హుజూరాబాద్

## పౌల్ట్రీఫారానికి ఓనర్‌నయ్యా..

నాది మహ్మద్‌నగర్ గ్రామం. మొన్నటి దాంకా కూలీకెళ్తుంటి. పౌల్ట్రీ ఫారంలనే కూలీ పని చేసేటోడ్ని. బాసాన్లు తీసుకొని ఊరూరా అమ్మేటోన్ని. నాకు ముగ్గురు పిల్లలు. ఇంటి ఖర్చులు పోను పిల్లలను చదివించుడు మస్తు కష్టమైతుండె. మా అసుంటోళ్ల కష్టాలు తీర్చనికి ముఖ్యమంత్రి కేసీఆర్ సారు దళితబంధు పథకం తీసుకొచ్చిండు. దాంతోని నేను పౌల్ట్రీ ఫారం కోసం దరఖాస్తు చేసుకున్నా. ప్రభుత్వం ఇచ్చిన పది లక్షల రూపాయలకు తోడు నా దగ్గర ఉన్న బంగారాన్ని అమ్మి రూ.15లక్షలతోని ఐదు వేల కోళ్లు పెంచేలా నా సొంత భూమిల పౌల్ట్రీ ఫారం ఏర్పాటు చేసుకున్నా. జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభా రాజు మేడం ఐదు నెలల కిందట ప్రారంభించారు. సుగుణ కంపెనీ వాళ్ల కోళ్లను తీసుకువచ్చి వేసిన. ఇప్పటికే రెండు బ్యాచుల కోళ్లను అమ్మేసిన. అన్ని ఖర్చులు పోను 70 వేలు మిగిలాయి. చానా సంతోషంగా ఉంది. జీవితంలో పౌల్ట్రీ ఫారం ఏర్పాటు చేస్తాను అనుకోలేదు. అంతా ముఖ్యమంత్రి సారు దయతోనే జరిగింది... జీవితాంతం ఆయనకు రుణ పడి ఉంటాను.

– దాసరి సాయిలు, మహ్మద్‌నగర్



కోళ్లఫారం వద్ద సాయిలు



## కాలరెగరేసి బతుకుతున్న..

మాది దేవరుప్పుల మండలం బంజర గ్రామం. గతంలో జనగామలోని ఓ బట్టల దుకాణంలో గుమస్తాగా పని చేశా. వాళ్లిచ్చే జీతం సరిపోయేది కాదు. మా కుటుంబానికి దళితబంధు ఆశా దీపంగా మారింది. ఇప్పుడు జనగామ మెయిన్ రోడ్డులో సొంతంగా షాపు పెట్టుకొని యజమానిగా 'కాలరెగరేసి' బతుకుతున్న. గతంలో పని చేసిన అనుభవంతో రూ.10 లక్షల ప్రభుత్వ సాయంతో 'ఫ్యాషన్ హబ్' పేరుతో బట్టల దుకాణం పెట్టుకున్నా. సక్సెస్‌ఫుల్‌గా దుకాణం నడుపుతున్న. జిల్లా కలెక్టర్ శివలింగయ్య సారు దుకాణానికి వచ్చారు. నా పనితనాన్ని చూసి శభాష్ అని మెచ్చుకున్నారు. దసరా, దీపావళి, డిసెంబర్ 31 వంటి ప్రత్యేక సందర్భాల్లో రోజుకు రూ.50 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు గిరాకీ అవుతున్నది. ఖర్చులు పోగా నెలకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు సంపాదిస్తున్నా. కేసీఆర్ సారు దయ వల్ల మా కుటుంబానికి మంచి రోజులు వచ్చాయి.

-సంగి నర్సయ్య, బంజర గ్రామం, దేవరుప్పుల మండలం, జనగామ జిల్లా




జనగామ జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన వస్త్ర దుకాణం వద్ద నర్సయ్య

## నెలకు 50 వేల సంపాదన..

మాది నిరుపేద కుటుంబం. మాకు ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నారు. ట్రాక్టర్ డోజర్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వాణ్ని. మా గ్రామాన్ని సీఎం కేసీఆర్ దత్తత తీసుకున్న తర్వాత మా బతుకులు మారినయి. దళితబంధు కింద కేసీఆర్ ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసింది. ఆ పైసలతోనే ట్రాక్టర్ డోజర్ కొన్నా. దాన్ని నడుపుకొంటూ దర్జాగా బతుకుతున్నా. ఖర్చులన్నీ పోను నెలకు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు సంపాదిస్తున్నా. ఇప్పటి వరకు రూ.2 లక్షల అప్పు కట్టిన. మా పెద్దమ్మాయిని బీటెక్ చదివించాను. ఆమె పెండ్లి కోసం డబ్బులు జమ చేస్తున్నా. త్వరలో పెండ్లి చేస్తా.

-గ్యార ఆండాలు నర్సింహులు, వాసాలమర్రి, తుర్కపల్లి మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా



ట్రాక్టర్‌పై ఆండాలు, నర్సింహులు దంపతులు



వెల్డింగ్ షాప్‌లో కంజర్ల రాము

## మరో ముగ్గురికి ఉపాధి ఇస్తున్నా..

దళితబంధు నిధులతో సొంత గ్రామంలో వెల్డింగ్ షాప్ పెట్టుకున్న. అంతకుముందు చిన్న మిషిన్‌ను వెంటేసుకొని ఊరూరు తిరిగి పని చేసుకునేవాడ్ని. ఇప్పుడు పెద్ద మిషినరీ సిస్టంతో ట్రాక్టర్ ట్రాలీలు, కల్టివేటర్లు, కేజ్ వీల్స్, షట్టర్స్, గ్రిల్స్ పనులు చేస్తున్న. తెలంగాణలో వ్యవసాయం బాగు పడటంతో రైతుల నుంచే ఆర్డర్లు బాగా వస్తున్నయి. నెలకు రూ.40 నుంచి రూ.50 వేల వరకు సంపాదిస్తున్నా. ఒకనాడు ఉపాధి కోసం వెతుక్కున్న నేను ఇప్పుడు ఇతరులకు ఉపాధి కల్పించడం గర్వంగా ఉంది. ఇంతకుముందు ఏ ప్రభుత్వమూ ఇలాంటి పథకాలను ప్రవేశపెట్టలేదు.

-కంజర్ల రాము, తిర్మలాపూర్, మెదక్ జిల్లా



దళితబంధు ద్వారా వచ్చిన వరినాటు యంత్రంపై నరేశ్

## మా దశ తిరిగింది..

ఒకళ్ల కింద పనులు చేసుకునే నా జీవితంలో దళితబంధు వెలుగులు నింపింది. నా భార్య, నేను కూలీ చేసుకుంటూ ముగ్గురు పిల్లల్ని సాదుకునేవాళ్లం. దళితబంధు సొమ్ముతో వరి నాట్లు వేసే యంత్రం కొన్న. సీజన్‌లో రెండు నెలలు మస్తు పనులుంటయి. మిగతా రోజుల్లో ఇతర పనులు చేసుకుంటున్న.

-తాళ్లపల్లి నరేశ్, రెడ్డిపల్లి, వీణవంక మండలం, కరీంనగర్ జిల్లా



దళితబంధు ద్వారా వచ్చిన హార్వెస్టర్ వద్ద అంబాల సునీత

## ఇద్దరి పొత్తుల హార్వెస్టర్ కొన్నం..

నేను వ్యవసాయ కూలీ పనులకు పోతుండె. నా భర్త రాజయ్య మేస్త్రీ పని చేస్తడు. ట్రాక్టర్ డ్రైవర్ కూడా. దళితబంధుకు నేను, మా తమ్ముడి భార్య కల్లెపెల్లి పూజ ఎంపికైనం. ఇద్దరం కలిసి హార్వెస్టర్ కొన్నాం. మొదటి ఏడాదిలోనే వరికోతల పనులు షురూ చేసినం. ఖర్చులు పోను రూ.లక్ష వరకు సంపాదించాం. సీజన్‌లో ఇక్కడ పనులు అయినంక హుజూర్‌నగర్ తీసుకెళ్లాం. నెల రోజుల్లోనే రూ.2 లక్షలు మిగిలాయి. సీజన్ ఎక్కడుంటే అక్కడికి పంపుతున్నం.

-అంబాల సునీత, రెడ్డిపల్లి, వీణవంక మండలం

## గర్వంగా స్వయం ఉపాధి..

నా పేరు కోటి దేవయ్య. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన దళిత బంధు పథకంతో మా బతుకులు మారిపోయాయి. గతంలో ఓ ప్రైవేట్ స్కూల్‌లో పని చేసిన. కుటుంబ పోషణ కష్టంగా ఉండేది. దళితబంధుతో ఇప్పుడు ఇబ్బందులు లేకుండా బతుకుతున్నాం. దళితబంధు నిధులతో హుస్నాబాద్ పట్టణంలో చెప్పుల దుకాణం ఏర్పాటు చేసుకున్నా. స్వయం ఉపాధి పొందుతూ కుటుంబానికి ఆర్థికంగా చేయూతగా నిలుస్తున్నా. నెలకు రూ.15 వేల వరకు సంపాదిస్తున్నా. దళితులు ఆర్థికంగా ఎదిగేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకొచ్చిన దళిత బంధు పథకంతో నాలాంటి ఎంతో మందికి జీవనోపాధి లభించింది. సీఎం కేసీఆర్‌కు మా కుటుంబం రుణపడి ఉంటుంది.

– కోటి దేవయ్య, తోటపల్లి, హుస్నాబాద్ మండలం, సిద్దిపేట జిల్లా



షాపులోకి వచ్చిన కస్టమర్‌తో దేవయ్య

## పంక్చర్లు వేస్తూ.. డ్రైవింగ్ చేసేవాణ్ని..

నాకు మా గ్రామం వద్ద చిన్న పంక్చర్ దుకాణం ఉండేది. గిరాకి లేనప్పుడు డ్రైవింగ్ చేసేందుకు వెళ్లేటోణ్ని. రెండెకరాల వ్యవసాయ పొలం ఉన్నది. ఇద్దరం అన్నదమ్ములం. పనిచేస్తేనే పొట్టగడిచేది. నాకు ముగ్గురు పిల్లలున్నారు. వారు చదువుకుంటున్నారు. వారి చదువులకు డబ్బులు అవసరం పడేవి. ఎంత పనిచేసినా తిండి, బట్టకే సరిగా చాలకపోయేది. చారకొండ మండలం దళితబంధు పథకానికి పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక కావడంతో మా బతుకులు కచ్చితంగా మారుతాయని అనుకున్నాం. ఊహించినట్లు జరిగింది. మా అన్నదమ్ములిద్దరికీ దళితబంధు పథకం వరించింది. నా తమ్ముడు టెంట్‌హౌస్ పెట్టుకుంటే.. నేను చారకొండ మండల కేంద్రంలో టైర్ల దుకాణం పెట్టుకున్నా.. నాకు పంక్చర్లు వేసే పని రావడంతో వ్యాపారం బాగా పెరిగింది. ఇక వైపు టైర్లు అమ్ముతూ.. మరో వైపు టైర్లు బిగిస్తాను. పంక్చర్ల దందా ఎలాగూ ఉన్నది. ఇప్పుడు చాలా సంతోషంగా ఉన్నది. వ్యాపారం బాగా సాగుతుంది. ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాను. మా పిల్లల చదువులకు ఎలాంటి ఢోకా లేదు. మా జీవితాల దశ మార్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వేల కోట్ల దండాలు. ఈ దందా, వ్యాపారం కేసీఆర్ చలువే.

– జంతుక యాదయ్య, టైర్ల దుకాణం యజమాని, రామచంద్రాపురం గ్రామం, చారకొండ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా




టైర్ల దుకాణం వద్ద జంతుక యాదయ్య